క్లుప్తంగా

నేటి నుంచి అమ్మవారి జాతర

పాలకోడేరు: పెన్నాడ గ్రామంలో వేంచేసి యున్న శ్రీదండు గంగాలమ్మ జాతర నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం గరగ నృత్యాలు, ఆదివారం అమ్మవారి దర్శనం, సోమవారం అన్న సమారాధన నిర్వహిస్తామని పేర్కొన్నారు.

గంగానమ్మకు పంచామృతాభిషేకం


గంగానమ్మకు పంచామృతాలతో అభిషేకం చేస్తున్న మహిళలు

ఆకివీడు: గంగానమ్మ కరుణించమ్మా అంటూ మహిళలు శుక్రవారం గంగానమ్మకు జలాభిషేకం, పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ 7వ వార్షికోత్సవం సందర్భంగా పురాతన ఆలయం, నూతనంగా నిర్మించిన ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చనలు చేశారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలు ఆలయ నిర్వాహకులు రామ అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

పేకాట శిబిరంపై దాడి

ఉండి: మండలంలోని పాందువ్వ శివారులో పేకాట శిబిరం నిర్వహిస్తున్న సమాచారం అందడంతో ఎస్సై ఎండీ నసీరుల్లా ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1940 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

లంచం అడుగుతున్నారని విద్యుత్ ఏఈకి ఫిర్యాదు

పాలకోడేరు: శృంగవృక్షంలో విద్యుత్ మీటర్లు కాలిపోయిన సందర్భంలో కొత్త మీటర్ వేయడానికి సిబ్బంది లంచం తీసుకుంటున్నారని గ్రామానికి చెందిన నూకల వీరభద్ర కోటేశ్వరరావు (పెదబాబు) ఆరోపించారు. ఒక్కో మీటర్‌కు రూ.1700 వసూలు చేశారని ఇదెక్కడ న్యాయమని ఆయన వాపోయారు. ఈ మేరకు సమగ్రమైన దర్యాప్తు నిర్వహించాలని కోరుతూ పెదబాబు పాలకోడేరు మండల విద్యుత్ ఏఈ మాధవరాజుకు ఫిర్యాదు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఏఈ దీనిపై చర్యలు తీసుకోకుండా తాత్సారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. విషయమై భీమవరం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) వెంకటేశ్వరరావును వివరణ కోరగా సమస్య తమ దృష్టికి రాలేదని విచారించి, చర్యలు చేపడతామని బదులిచ్చారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమవరం: ఒకటో పట్టణంలోని మెంటేవారి తోటకు చెందిన అబ్దుల్ కరీం (45) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అప్పుల బాధతో ఈ నెల 12న పురుగుల మందు తాగాడని, ఏలూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందగా హెడ్ కానిస్టేబుల్ వై.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారన్నారు.

శ్రీవిజయ గణపతికి బంగారు నామం సమర్పణ

భీమవరం(ప్రకాశంచౌక్): సంకట హర చతుర్థి సందర్భంగా మెంటేవారి తోటలోని శ్రీవిజయ గణపతి స్వామికి దాతలు బంగారు నామం సమర్పించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన తోట సురేష్, లీలా మాధవీ దంపతులు 5 గ్రాముల బంగారంతో తయారు చేయించిన నామాన్ని అందజేశారు. ఆలయ అర్చకులు స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, సహస్ర గరిక పూజ, లక్ష్మీ గణపతి హోమం, పూర్ణాహుతి నీరాజన మంత్ర పుష్పాలతో పూజా చేసి మామిడి పండ్లతో అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

రక్తహీనతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.సూర్యకుమారి

పాలకోడేరు: మండలంలోని గొరగనమూడి అంగన్‌వాడీ కేంద్రం వద్ద కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఐసీడీఎస్ సిబ్బంది రక్తహీనతపై బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.సూర్యకుమారి మాట్లాడుతూ ఐరన్ లోపం వలన రక్తహీనత ఏర్పడుతుందని నివారణకు గుడ్లు, ఆకుకూరలు, సిట్రస్ జాతికి చెందిన ఫలాలు, నులి పురుగుల నివారణకు మందులు తీసుకోవాలన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హెల్త్ అసిస్టెంట్ మరపట్ల విజయ్‌ప్రసాద్ మాట్లాడుతూ గర్భిణులు అధిక శాతం రక్తహీనతతో బాధ పడుతున్నారని, ప్రసవ సమయంలో ఇబ్బందులు కలుగుతాయన్నారు. రక్తహీనత నివారణకు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎంఎస్‌కే జ్యోతి, సిబ్బంది, బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో రెవెన్యూ గెస్ట్ హౌస్

- అసాంఘిక కార్యకలాపాలకు నెలవు
- పట్టించుకోని శాఖ ఉన్నతాధికారులు


పిచ్చి మొక్కలతో శిథిలావస్థకు చేరిన రెవెన్యూ గెస్ట్‌హౌస్



రెవెన్యూ గెస్ట్‌హౌస్ ప్రారంభోత్సవంలో ఏర్పాటు చేసిన అప్పటి శిలాఫలకం

భీమవరం: పట్టణం నడిబొడ్డున ఉన్న రెవెన్యూ గెస్ట్ హౌస్ శిథిలావస్థకు చేరడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. వన్‌టౌన్ ప్రాంతంలోని తహసీల్దార్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు, కోర్టు, సబ్ జైలు, ట్రెజరీ కార్యాలయం, వన్‌టౌన్ పోలీసుస్టేషన్, డీఎస్పీ కార్యాలయం, మండలపరిషత్ కార్యాలయాలు వంటి అనేక ప్రభుత్వం కార్యాలయాలకు సెంటర్ పాయింట్‌లో రెవెన్యూ గెస్ట్‌హౌస్ నిర్మాణానికి 1973 ఆగస్టు 4వ తేదీన అప్పటి జిల్లా కలెక్టర్ ఎస్ఆర్ గోవిందరాజన్ శంకుస్థాపన చేశారు. విశాలమైన ఆవరణలో ఎంతో సుందరంగా నిర్మించిన గెస్ట్‌హౌస్ భవనాన్ని 1974 ఏప్రిల్ 18వ తేదీన అప్పటి కలెక్టర్ జి.కుమారస్వామిరెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఏలూరు జిల్లా కేంద్రంగా నరసాపురం రెవెన్యూ సబ్ డివిజన్, భీమవరం తాలూకా కార్యాలయంగా ఉన్న అప్పటి రోజుల్లో ఏలూరు నుంచి జిల్లా అధికారులు భీమవరం పరిసర ప్రాంతాలకు వస్తే భీమవరం పట్టణంలోని రెవెన్యూ గెస్ట్‌హౌస్‌లోనే బస చేసేవారు. అన్ని హంగులతో ఎంతో అనువుగా ఉన్న రెవెన్యూ గెస్ట్ హౌస్‌ను అధికారులే కాకుండా ప్రజా ప్రతినిధులు కూడా వినియోగించుకునే వారు.

2009లో పునః ప్రారంభం

అయితే చాలా కాలం క్రితం నిర్మించిన గెస్ట్‌హౌస్ అక్కడక్కడా దెబ్బతినడంతో 2009లో పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసి అప్పటి కలెక్టర్ జి.జయలక్ష్మి పునఃప్రారంభించారు. అప్పటి నుంచి విశేష సేవలందించిన గెస్ట్‌హౌస్ శిథిలావస్థకు చేరుకుంది. 2022 ఏప్రిల్ 4వ తేదీన భీమవరం పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం కావడంతో పాటు రెవెన్యూ సబ్ డివిజన్ ఏర్పాటు అయ్యింది. ఈ నేపథ్యంలో శిథిలావస్థకు చేరిన గెస్ట్‌హౌస్ భవనాన్ని తొలగించి నూతన భవనాన్ని నిర్మించి ప్రభుత్వ కార్యాలయానికి వినియోగించుకోవాలనే ప్రతిపాదన వచ్చింది. అయితే అప్పటికప్పుడు ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాల్సి రావడంతో నూతన భవన నిర్మాణం ప్రతిపాదన విరమించుకున్నారు. తరువాత పట్టణంలో కోట్లాది రూపాయల వ్యయంతో అనేక భవనాలు నిర్మించినా రెవెన్యూ గెస్ట్‌హౌస్‌ను పట్టించుకున్న నాథుడు లేడు. ప్రస్తుతం భవనం చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచి భూత్‌బంగళాను తలపిస్తోంది. భవనం తలుపులు తీసి ఉండడంతో పేకాట రాయుళ్లు, మందు బాబులకు అడ్డాగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొత్త భవనం నిర్మించకపోవడంతో ఉన్నతాధికారుల బస కోసం ప్రైవేటు కళాశాలల గెస్ట్ హౌస్‌లు, ఇతర గెస్ట్ హౌస్‌లకు పరుగులు తీయాల్సి వస్తుంది. కోట్లాది రూపాయల విలువ గల ప్రభుత్వ భూమి లో ఉన్న రెవెన్యూ గెస్ట్‌హౌస్ స్థానంలో ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు నిర్మించుకుంటే ఉప యోగం ఉంటుందని దీనిపై ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఏపీఆర్‌జేసీలో పాందువ్వ విద్యార్థికి ప్రథమ స్థానం


విద్యార్థి మనోజ్ కుమార్

ఉండి: ఏపీఆర్‌జేసీ ఎంట్రన్స్ పరీక్షా ఫలితాల్లో పాందువ్వ గ్రామానికి చెందిన మనోజ్ కుమార్ బైపీసీ విభాగంలో ప్రథమ స్థానం సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం గ్రామంలో ప్రజా ప్రతినిధులు మనోజ్‌కుమార్‌ను అభినందించారు. తండ్రి సత్యనారాయణ పోలీస్ కానిస్టేబుల్ కాగా తల్లి టీచర్‌గా పని చేస్తున్నారు. మనోజ్ కుమార్ రాజమండ్రిలోని ఓ ప్రైవేటు విద్యా సంస్థలో ప్రస్తుతం పదో తరగతి చదువు పూర్తి చేశాడు.

దుర్గాదేవికి పూలతో అలంకరణ


కనకాంబరం పూల అలంకరణలో దుర్గాదేవి

కాళ్ల: మండలంలోని కోమటిగుంటలో వేంచేసియున్న దుర్గాదేవి అమ్మవారు కనకాంబరం పూల అలంకరణలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. వైశాఖమాసం దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని కనకాంబరం పుష్పమాలతో విశేషంగా అలంకరించినట్లు ఆలయ అర్చకులు శ్రీనివాసుల పవన్‌కుమార్ తెలిపారు. ఆలయ అనువంశిక ధర్మకర్త ఎరుబండి రామాంజనేయుల కుమారుడు పవన్‌కుమార్, లక్ష్మీనాగశ్రీ దంపతులచే అమ్మవారికి విశేష కుంకుమ పూజలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో దాతలు సహకారంతో అఖండ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

అనధికార లే అవుట్లపై ఫిర్యాదు


నాన్ లేఅవుట్‌లో నిర్మాణం చేపట్టిన కట్టడం

పాలకోడేరు: మండలంలోని శృంగవృక్షంలో పంచాయతీ అనుమతులు లేకుండా అనధికార లే అవుట్లు వేసి క్రయ విక్రయాలు జరుపుతున్నా పంచాయతీ పట్టించుకోవడం లేదని వైఎస్సార్‌సీపీ నాయకుడు నూకల పెదబాబు ఆరోపించారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని 360-4 సర్వే నంబర్‌లో 38 సెంట్లు అనధికారికంగా లే అవుట్లు వేసి విక్రయాలు చేశారని, అందులో పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణం ప్రారంభిస్తుంటే, ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. పంచాయతీ ఆదాయం కోల్పోతున్నప్పటికీ, ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

సచివాలయాల్లో సిబ్బంది కొరత

- కూటమి ప్రభుత్వంలో సచివాలయాలు కళావిహీనం
- 1, 2 వార్డు సచివాలయాల్లో ఇద్దరేసి సిబ్బంది
- మిగిలిన వాటిలో నలుగురైదుగురే
- పాలకులకు పట్టదు.. అధికారులకు గిట్టదు



మూసివేసి ఉన్న గుమ్ములూరు సెంటర్‌లోని 2వ వార్డు సచివాలయం

ఆకివీడు: సిబ్బందితో కళకళలాడుతూ ప్రజలకు 500లకు పైగా సేవలందిస్తూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ దేశంలోనే మిన్నగా ఉండేది. కాని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది తిరక్కుండానే గ్రామ, వార్డు సచివాలయాలు మూతపడే స్థితికి చేరుకున్నాయి. కొన్నింటిని సిబ్బంది లేక మూత వేస్తున్నారు. అదేమిటని అడిగితే నగర పంచాయతీ కార్యాలయానికి వెళ్లాం, ఫీల్డ్ మీద ఉన్నామని చెబుతున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయాల్లో రేషన్ కార్డుల నమోదు ప్రక్రియ, వితంతు పింఛన్ దరఖాస్తుల నమోదు, ఇతర ప్రభుత్వ అవసరాలు తీరక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కార్యాలయాలకు పనులు మానుకొని పలుమార్లు తిరగాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు.

వైఎస్ జగన్ పరిపాలనలో..

జగనన్న పరిపాలనలో వార్డు సచివాలయంలో 10 మంది సిబ్బందితో కళకళలాడుతూ ఉండేది. ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలందించారు. ఆ తరువాత పలు కారణాల రీత్యా, ఉన్నత ఉద్యోగం రావడంతో కొంత మంది సిబ్బంది ఉద్యోగాల నుంచి తప్పుకున్నారు. 8 మంది సిబ్బందికి తక్కువ కాకుండా సేవలందించారు. ప్రజల ముంగిటే పరిపాలన, గ్రామ స్వరాజ్యం పేరుతో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థను దేశంలోని పలు రాష్ట్రాలు ఆదర్శప్రాయంగా తీసుకున్నాయి. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో దేశంలోనే ఉత్తమ ముఖ్యమంత్రి అవార్డును కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుకున్నారు.

కూటమి కుట్రతో కళావిహీనం

గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ కూటమి కుట్రతో కళా విహీనమైందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో తగినంత సిబ్బంది లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని 1వ వార్డు సచివాలయంలో ఏఎన్ఎం, ఇంజనీరింగ్ అసిస్టెంట్, 2వ వార్డు సచివాలయంలో ఏఎన్ఎం, మహిళా పోలీస్ మాత్రమే పని చేస్తున్నారు. 3వ వార్డు సచివాలయంలో వెల్ఫేర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, ఏఎన్ఎం, మహిళా పోలీస్, 4వ వార్డు సచివాలయంలో కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, వీఆర్వో, మహిళా పోలీస్, ఏఎన్ఎం, 5వ వార్డు సచివాలయంలో కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్, ఏఎన్ఎం, మహిళా పోలీస్ మాత్రమే పని చేస్తున్నారు. వార్డు సచివాలయాల పనితీరు నగర పంచాయతీ పరిధిలో దారుణంగా ఉందని స్థానికులు వాపోతున్నారు.

అస్తవ్యస్తంగా రేషనలైజేషన్

సచివాలయాల్లో జనాభా ప్రాతిపదికన సిబ్బందిని నియమిస్తూ రేషనలైజేషన్‌పై కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సిబ్బంది అధికంగా ఉన్నారనే సాకుతో ఏర్పాటు చేసిన ఉత్తర్వుల అమలులో వైఫల్యం చెందిందని పలువురు ఆరోపిస్తున్నారు. సచివాలయాలను ఏబీసీ కేటగిరీలుగా విభజించి సిబ్బందిని నియమించాలని ప్రతిపాదించారు. ఆ విధంగా సిబ్బంది సచివాలయాల్లో లేకపోవడంతో పౌరులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం.

> **వేధిస్తున్న సిబ్బంది కొరత**
>
> 
>
> వార్డు సచివాలయంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. స్థానిక 1, 2 వార్డు సచివాలయాల్లో ఇద్దరేసి సిబ్బంది ఉన్నారు. వారిలో 2వ వార్డు సచివాలయంలో మహిళా పోలీస్ సెలవుపై వెళ్లారు. ఇక్కడ అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని నియమించి, రేషన్ కార్డులు ఆన్‌లైన్ చేయిస్తున్నాం. సిబ్బంది కొరత, మూసివేస్తున్నారని టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. డిప్యుటేషన్‌పై ఒక ఉద్యోగిని సీఎం ఆఫీసుకు పంపాం. జీతం ఇక్కడి నుంచే ఇస్తున్నాం. బదిలీల్లో ఆయా స్థానాలను నింపుతాం.
>
> –జి.కృష్ణమోహన్, కమిషనర్, ఆకివీడు నగర పంచాయతీ

తారు రోడ్డుపై కంకర రోడ్డు


అర్తమూరులో తారు రోడ్డుపై కంకర వేయడంతో నిలిచిపోయిన వర్షపు నీరు

ఉండి: తారురోడ్డుపై కంకర రోడ్డు వేయడం ఆర్ అండ్‌బీ అధికారులకే సాధ్యమనేటట్లు చేశారు అధికారులు. ఎవరైనా కంకర రోడ్డును సరి చేసి తారురోడ్డు వేస్తారు కానీ అర్తమూరులో ఆర్‌అండ్‌బీ అధికారులు ఇటీవల రోడ్డు మరమ్మతులు చేపట్టారు. అయితే వెంటనే పాడైపోవడంతో అధికారులు తారు రోడ్డుపై కంకర పోసి చేతులు దులుపుకున్నారు. దీంతో వాహనదారులు, స్థానికులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతే కాకుండా గురువారం కురిసిన కొద్దిపాటి వర్షానికి రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని తారురోడ్డుపై కంకర వేయడం ఏమిటని స్థానికులు మండిపడుతున్నారు. దీనిపై అధికారులు దృష్టి పెడితే ప్రజలు, వాహనదారుల కష్టాలు తీరుతాయని వారంటున్నారు.

ఈదురుగాలులతో బీభత్సం


విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టిన సిబ్బంది


ట్రాన్స్‌ఫార్మర్‌పై పడిన చెట్లు

ఆకివీడు: విద్యుత్ సరఫరాకు తీవ్ర ఆటంకం కలగడంతో పట్టణ ప్రజలు శుక్రవారం నరకాన్ని చూశారు. తెల్లవారు జాము నుంచి జానకమ్మ ఆసుపత్రి ప్రాంతాల్లో ఈదురుగాలులకు మామిడి చెట్టు కుప్పకూలడంతో విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. ఆ ప్రాంతంలో మధ్యాహ్నం వరకూ విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేదు. అయిభీమవరం టర్నింగ్, క్యాబిన్ రోడ్డు ప్రాంతాల్లో మూడు చోట్ల హైటెక్షన్ విద్యుత్ వైర్లు తెగి, పెద్ద శబ్దంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వీటితో పాటు గురువారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిప్పు రవ్వలు ఎగసిపడి ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. దీనిని పునరుద్ధరించేందుకు ఏలూరు నుంచి విద్యుత్ సిబ్బంది హుటాహుటిన వచ్చి పనులు ప్రారంభించారు. దీంతో మధ్యాహ్నం నుంచి సాయింత్రం ఆరున్నర గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌కో ఏఈ రత్నాకర్, ఎల్ఐ ఆంజనేయరాజు ఆధ్వర్యంలో సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన ఆయా పనులు చేపట్టినప్పటికీ సకాలంలో సరఫరా ఇవ్వలేదు. ఇన్వర్టర్లు కొంత సేపు మాత్రమే పని చేశాయి.

పారిశుద్ధ్య పనుల పరిశీలన


డ్రెయినేజీని పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్

పాలకొల్లు సెంట్రల్: స్థానిక 17వ వార్డు పాత బ్యాంక్ కాలనీలో పారిశుద్ధ్య పనులను మునిసిపల్ కమిషనర్ బి.విజయసారథి శుక్రవారం పరిశీలించారు. గురువారం కురిసిన వర్షానికి పాత బ్యాంక్ కాలనీ వెనుక ఉన్న ప్రాంతంలో వర్షం నీరు నిల్వ ఉండిపోయి స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమాచారం కమిషనర్‌కు తెలియపజేయగా ఉదయాన్నే పట్టణ విజిట్‌లో భాగంగా ఆ ప్రాంతానికి వచ్చి పరిశీలించారు. అక్కడ వర్షం నీరు నిల్వ ఉండిపోవడంతో వెంటనే శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బందిని పిలిచి ఎక్కడ అడ్డంకులు ఉన్నాయో తొలగించాలని సూచించారు. ఆలయం వద్ద డ్రెయినేజీపై నిర్మాణాలు కట్టడంతో డ్రెయిన్ చిన్నది అయిపోయిందని, వెంటనే వాటిని పగలగొట్టి మురుగునీరు వెళ్లే మార్గం చూడాలని శానిటరీ అధికారులను ఆదేశించారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి


కాళ్ల: పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కాళ్ల: డెంగీపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఎస్.సునీల్ అన్నారు. కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ తీవ్రమైన జ్వరం, తలనొప్పి, శరీరంపై ఎర్రటి దద్దుర్లు, కంటి వెనుక కండరాల నొప్పి, వాంతులు, వికారం లక్షణాలు ఉన్నట్లయితే ప్రాణాపాయం సంభవిస్తుందని వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ డి.విజయావతి, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల ద్వారా వ్యాప్తి

పాలకోడేరు: జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ చినమిల్లి వెంకట రంగంనాయుడు మాట్లాడు తూ డెంగీ ఫీవర్ దోమల ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సత్యనారాయణ, పీహెచ్‌ఎన్ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

అశ్రద్ధ చేస్తే ప్రాణాంతకం

ఉండి: యండగండి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డెంగీపై శుక్రవారం అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బెన్నీ సామ్యూల్ మాట్లాడుతూ దోమల ద్వారా సంక్రమించే డెంగీ ప్రాణాంతకమని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో ఎం.రత్నరాజు, ఎంపీహెచ్‌ఎస్ ఎంఎల్ శ్రీనివాస్, పీహెచ్‌ఎస్ ఎం.దుర్గాకుమారి, తదితరులు పాల్గొన్నారు.


పాలకోడేరు: ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ రంగమనాయుడు, వైద్య సిబ్బంది


ఉండి: డెంగీపై అవగాహన కల్పిస్తున్న వైద్య అధికారులు

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దుర్వినియోగం చేయొద్దు

భీమవరం: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు నూరుశాతం ఖర్చు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం భీమవరంలో దాసరి చిరంజీవి అధ్యక్షతన నిర్వహించిన మాల మహానాడు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ నిధులను వేరే శాఖలకు మళ్లిస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి నేతల సువర్ణరాజు, జిల్లా అధ్యక్షుడు ఇంటి సుందరకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోలాటి ప్రసాదరావు, చిగురుపాటి రాజేష్, తొర్లపాటి భాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ముడుపుల ఆరోపణలు అవాస్తవం

భీమవరం: మున్సిపాలిటీ పన్ను విధింపులో పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారినట్లు వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని మున్సిపల్ అధికారులు స్పష్టం చేశారు. పన్ను విషయంలో దస్తావేజులు పూర్తిగా పరిశీలించి నిబంధనల ప్రకారం పన్ను విధించామని అయితే మరో వ్యక్తి దానిపై తాను పన్ను చెల్లిస్తున్నట్లు తెలియజేసినట్లు వివరించారు. దీనిపై మున్సిపల్ చట్టం ప్రకారం దస్తావేజులు పరిశీలించి పన్ను విధింపు లేదా తొలగింపు కమిషనర్ పరిధిలో ఉంటుందని సిబ్బంది వివరణ ఇచ్చారు. పన్ను విధించిన ఆస్తికి సంబంధించిన వ్యవహారం కోర్టులో ఉన్నప్పటికీ కావాలని కొందరు మున్సిపల్ రెవెన్యూ సిబ్బందిని వివరణ అడగకుండా దస్తావేజులు పూర్తి స్థాయిలో విచారణ చేయకుండా సిఫార్సులకు లొంగి ఏకపక్షంగా నివేదిక తయారు చేసి, కొంతమందిపై తప్పుడు రిపోర్ట్ ఇవ్వడంతో ప్రభుత్వం ఉత్త ర్వులు ఇచ్చినట్లు చెబుతున్నారు. వ్యవహారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని మున్సిపల్ చట్టం ప్రకారం విచారణ జరిపించాలని సిబ్బంది కోరుతున్నారు.